ఎమ్మెల్యే కృష్ణారావు దంపతులకు శుభాకాంక్షలు



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న రాజేశ్వరరావు, తులసీరావు తదితరులు

కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, లక్ష్మీబాయి దంపతుల వివాహ వార్షికోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు షిరిడీ సాయిబాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, తూముకుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, నాయినేని తులసీరావు, కౌన్సిలర్లు వారికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. – కూకట్‌పల్లి

వైభవంగా మేడారం మినీ జాతర మహోత్సవాలు



మినీ జాతర మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులు





అల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పాపిరెడ్డినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ వద్ద ఉన్న సమ్మక్క, సారలమ్మ మినీ మేడారం జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం శ్రీసమ్మక్క, సారలమ్మలను గద్దెలపై ప్రతిష్ఠించారు. జాతర మహోత్సవం కమిటీ అధ్యక్షుడు శ్రీధర్ పటేల్, చైర్‌పర్సన్స్ భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్ పటేల్, గంగుల రాజిరెడ్డిల ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా సమ్మక్క, సారలమ్మలకు స్థానికంగా ఉన్న హుడా పార్కు నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మ, నల్లపోచమ్మ, వీరాంజనేయ శివాలయం వద్ద నుంచి భారీగా భక్తులు డప్పు చప్పుళ్లు, కోలాటాలు, శివసత్తుల వీరంగాల మధ్య అమ్మవార్లను కన్నుల పండువగా గద్దెలపైకి వేడుకగా తీసుకువచ్చి ప్రతిష్ఠించారు.

◆ నగరం నుంచి వివిధ ప్రాంతాల భక్తులు తరలి వచ్చి అమ్మవార్లకు ఒడిబియ్యం, బెల్లం బంగారం, పట్టువస్త్రాలతో మొక్కులు సమర్పించుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవార్లకు ప్రత్యేక జాతర వేడుకలు జరుగుతాయని తెలిపారు. శనివారం అమ్మవార్లను వన పునప్రవేశం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పర్వతాలు యాదవ్, బాలు యాదవ్, సాయి కుమార్‌పటేల్, నర్సింగరావు, రాజేంద్ర ప్రసాద్, శ్రీలత పటేల్, శ్రీకాంత్‌యాదవ్, పాలమూరు భాస్కర్, లక్ష్మీనారాయణ, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

భవన వ్యర్థాల తొలగిస్తుంటే వ్యక్తి మృతదేహం లభ్యం



స్వామిరెడ్డి రాజు (ఫైల్)



భవన వ్యర్థాల మధ్య స్వామిరెడ్డి రాజు మృతదేహం

మూసాపేట: మూసాపేటలో పాత ఇంటికి కూల్చివేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన స్వామిరెడ్డి రాజు (45) తండ్రి సీతారాం మూసాపేటలో ఒక్కడే ఇల్లు అద్దెకు తీసుకొని కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కూతురికి వివాహం అయ్యింది. కుమారుడు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్నారు. కుటుంబ సభ్యులు మూసాపేటలోని వడ్డెర బస్తీలో విడిగా నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసై కుటుంబ కలహాల కారణంగా స్వామిరెడ్డి రాజు ఒక్కడే కొన్ని సంవత్సరాలుగా ఒంటరిగా ఉంటున్నాడు. అయితే మూసాపేటలో పాత ఇంటిని కూల్చివేస్తున్నారు.

◆ గత నెల నుంచి అద్దెకు ఉన్నవారిని ఖాళీ చేయమని యజమాని చెప్పారు. ఈ నెలలో కిరాయిదారులు ఖాళీ చేశారు. దీంతో కూల్చివేత పనులు ప్రారంభించారు. బుధవారం ఇంటి తలుపులు, శ్లాబు రేకులు తీసివేస్తున్నప్పుడు అతను కనిపించడంతో పంపించి వేశారు. తలుపులు, రేకులు తొలగించిన తరువాత ఎవరు లేని సమయంలో మద్యం మైకంలో వెళ్లి ఉండవచ్చని భావిస్తున్నారు. అప్పుడే పంపించి వేయటంతో ఎవరూ లేరు అనుకుని జేసీబీతో కూల్చివేశారు. రాత్రి మట్టిని తరలిస్తుండగా స్వామిరెడ్డి రాజు మృతదేహం బయటపడింది. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్నల్ మార్కులు ఆన్‌లైన్‌లోకి..

- టెన్త్ అంతర్గత మార్కుల తనిఖీ పూర్తి
- ఆన్‌లైన్‌లో నమోదుకు విద్యాశాఖ కసరత్తు
- ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు 20 మార్కులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మానిటరింగ్ బృందాలు తనిఖీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాయి. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలలకు వెళ్లి పరిశీలించాయి. విద్యార్థుల్లో సొంత ఆలోచనలకు ప్రాధాన్యమిస్తూ దాదాపు 9 ఏళ్ల నుంచి విద్యాశాఖ సీసీఈ(నిరంతర సమగ్ర మూల్యాంకనం) విధానాన్ని అమలు పరుస్తోంది. ఈ విధానంలో భాగంగానే ప్రతి ప్రతిసంవత్సరం అంతర్గత(ఇంటర్నల్) మార్కుల పరిశీలన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. గత విద్యా సంవత్సరం 6 పరీక్షలు నిర్వహించగా, ఈసారి ప్రభుత్వం సామాన్య శాస్త్రానికి రెండు పరీక్షలు కేటాయించడంతో మొత్తం ఏడు పరీక్షలు జరగనున్నాయి. దీంతో అంతర్గతంగా విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వేయనున్న 20 మార్కులకు ప్రాధాన్యం సంతరించుకుంది.

18 నుంచి వార్షిక పరీక్షలు...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కలిపి మొత్తం 880 ఉండగా, ఇందులో 46,838 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరంతా మార్చి 18 నుంచి వార్షిక పరీక్షలు రాయనున్నారు. 80 మార్కులకు ఈ పరీక్షలు ఉంటాయి. మిగిలిన 20 మార్కులను తరగతి ప్రాజెక్ట్ వర్క్, ల్యాబ్ బుక్, సమకాలీన సామాజిక సమస్యలు, నోట్‌బుక్, ఎస్‌ఏ 12.3.4లో వచ్చిన మార్కులు, ప్రయోగాల నిర్వహణ తదితరాలపై ఆధారపడి ఉంటాయి. ఈ మార్కులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వేస్తారు. విద్యార్థి ప్రతిభ ఆధారంగా వేశారా? లేదా అనేది ఈ నెల 9 నుంచి 17 వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మానిటరింగ్ బృందాలు సంబంధిత పాఠశాలలకు వెళ్లి పరిశీలించాయి. ఇటీవలే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కూడా వీటికి సంబంధించిన నివేదికలను కూడా అందజేశారు. పరిశీలన చేసిన బృందంలో ప్రధానోపాధ్యాయులతో పాటు ఇద్దరు సబ్జెక్టు ఉపాధ్యాయులు ఉన్నారు. అలాగే.., ఈ నెల 22 నుంచి 29 వరకు అంతర్గత మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వివరాలు

ప్రభుత్వ పాఠశాలలు:	105
పదో తరగతి విద్యార్థులు:	9,100
ప్రైవేట్ పాఠశాలలు:	775
పది విద్యార్థులు:	37,738

ఖాళీ కుర్చీలే.. ఒక్క అధికారి ఉండడే..!

ఇలా అయితే మెరుగైన పాలన ఎలా సాధ్యం?

- వార్డు కార్యాలయంలో కనిపించని అధికారులు
- సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియని అయోమయంలో స్థానికులు



అపరిశుభ్రంగా ఉన్న వార్డు కార్యాలయం ఆవరణ





అధికారులు, సిబ్బంది లేక బోసిపోయిన వార్డు కార్యాలయం

మోతీనగర్: ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వం నగరంలోని ప్రతి డివిజన్‌లో వార్డు కార్యాలయాలను ప్రారంభించింది. మున్నాళ్లకే ఇవి మూతపడ్డాయి. అల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయం శ్రీవివేకానంద నగర్‌లో అన్ని హంగులతో ఏర్పాటు చేసి అధికారులను సైతం నియమించారు. మూసాపేట సర్కిల్ పరిధిలోని మూసాపేట డివిజన్ మోతనగర్ ఈ సేవ మొదటి అంతస్తులో వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ కూడా అన్ని విభాగాల అధికారులను, కిందిస్థాయి సిబ్బందిని ఎంతో ఆర్భాటంగా నియమించారు.

◆ ఇటీవల కాలంలో వార్డు కార్యాలయంలో ఎప్పుడు చూసినా అధికారులు లేకుండా ఖాళీ కుర్చీలే కనిపిస్తున్నాయి. వార్డు కార్యాలయం ప్రారంభ సమయంలో ప్రజలు కూడా మెరుగైన పాలన అందుతుందని ఆశించారు. కానీ నేడు కార్యాలయాల్లో ఏ ఒక్క అధికారి కూడా కనుచూపు మేరలో కూడా కనబడటం లేదు.

◆ కార్యాలయంలో జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల సిబ్బందికి సంబంధించిన నేమ్ బోర్డులు ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. తిరిగి ఏ పని అవసరమున్నా సర్కిల్ కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎందుకు అధికారులు అందుబాటులో ఉండటం లేదో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కేవలం ఆస్తి పన్ను చెల్లించే వారు మాత్రమే కనిపిస్తుంటారు. మిగిలిన వారు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది.

◆ వార్డు కార్యాలయం ప్రారంభించే సమయంలో అధికారులు ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. అంతేకాకుండా ప్రస్తుతం ఆయా కార్యాలయంలో కేవలం కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే ఉంటాడని పలుమార్లు, వార్డు కార్యాలయాల్లో ఉంటే సిబ్బంది తెలుపుతున్నారు. ఏది ఏమైనా గత ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాలు మున్నాళ్ల ముచ్చటగా తయారైంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు వెంటనే స్పందించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలి.

ఉన్నతాధికారులు స్పందించాలి..



గత ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతో ప్రతి డివిజన్‌లో వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేయటం హర్షించదగ్గ విషయమే. కానీ నేడు ఆ పరిస్థితి కనిపించటం లేదు. కార్యాలయాల్లో కేవలం కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే ఉంటారని అక్కడికి వెళ్తే చెబుతున్నారు. కానీ ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వార్డు కార్యాలయంలో సిబ్బందిని నియమించి ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించాలి.

– బొంతు హరికృష్ణ, శ్రీవివేకానందనగర్

వేసవిలో విద్యుత్ సరఫరాపై సమీక్ష



సమీక్ష సమావేశంలో ఎస్సీ మోహన్, అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని విద్యుత్ కార్యాలయంలో గురువారం విద్యుత్ అధికారులతో ఎస్‌ఇ డిఎస్ మోహన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు సకాలంలో స్పందించకుండా సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని కరెంటు సరఫరాలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఫోన్ ద్వారా వచ్చిన సమస్యలపై కూడా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారులు విద్యుత్ సమస్యపై ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించాలన్నారు. విద్యుత్ సమస్యలపై ఏ మాత్రం ఆలస్యం చేయకుండా సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

మనూ ప్రొఫెసర్‌కు యునెస్కో ఆహ్వానం

రాయదుర్గం: మనూలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్‌కు యునెస్కో కెనడా సమావేశానికి ఆహ్వానం అందించింది. డిజిటల్ పర్యావరణంపై కెనడాలోని క్యూబెక్‌సిటీలో మే 2024లో కెనడా ప్రభుత్వం నిర్వహించే రిఫ్లెక్షన్ గ్రూప్ మొదటి సమావేశానికి రిజ్వాన్ పాల్గొంటారు. యునెస్కో ద్వారా ప్రపంచంలోని నలుమూలల నుంచి 18 మంది నిపుణులను ఎంపిక చేయగా అందులో 'మనూ' ప్రొఫెసర్‌కు అవకాశం లభించింది.

కుష్టు రోగులను మనలో ఒకరిగా చూడాలి

- ఇది ఒకరి నుంచి మరొకరికి సంక్రమించదు
- మహమ్మద్ జాహిద్ షరీఫ్ బాబా



అవగాహన కార్యక్రమంలో లిప్రా సొసైటీ సభ్యులు, మహమ్మద్ జాహిద్ షరీఫ్‌బాబా

మోతీనగర్: కుష్టు రోగులను వేరుగా చూడకుండా మనలో ఒకరిగా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ జాహిద్ షరీఫ్ బాబా పేర్కొన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో లిప్రా సొసైటీ 35 వార్షికోత్సవం సందర్భంగా కుష్టు రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి వారికి అవసరమయ్యే బ్యాండేజ్ కిట్లను సొసైటీ ప్రతినిధులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్వత్‌నగర్‌లో అనేక మంది కుష్టు రోగులు ఉన్నారని, వారికి నిరంతరం ప్రభుత్వంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు సైతం వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. అదే విధంగా వారికి కావాల్సిన మందులు, నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందజేస్తున్నామని తెలిపారు. కుష్టురోగులు అనగానే చాలా మంది దగ్గరకు రానివ్వకుండా చూస్తుంటారని, ఆ విధంగా కాకుండా వారిని కూడా మనలో ఒకరిగా చూస్తే వారు రోగంతో బాధపడుతున్నామన్న సంగతి మర్చిపోయి సంతోషంగా ముందుకు వెళతారన్నారు. కుష్టు రోగుల వల్ల వారికున్న రోగం మనకు సంక్రమించదన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రశాంత నాయక్, హెడ్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి అరుణకుమారి, స్టేట్ కో ఆర్డినేటర్ రాధిక, ప్రాజెక్టు ఆఫీసర్ కామేశ్వరరావు, ఫిజియోథెరపీ బాబూరావు, సొసైటీ ప్రతినిధి అశోక్, స్థానిక నాయకులు కుమ్మరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ యాజమాన్యాన్ని ఒప్పించి.. కార్మికురాలికి గ్రాట్యుటీ ఇప్పించి



గ్రాట్యుటీ మొత్తాన్ని అందజేస్తున్న కార్మికనాయకుడు రవిసింగ్ తదితరులు

మూసాపేట: బాలానగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో అశోక్ ఫ్యాబ్రికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో స్వప్న అనే కార్మికురాలు గత 16 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నది. అనివార్య కారణాలతో కొన్ని రోజులు పనికి వెళ్లలేదు. దీంతో కంపెనీ యాజమాన్యం ఆమెను పనిలోకి తీసుకోలేదు. దీంతో కార్మికురాలు 16 సంవత్సరాల నుంచి పనిచేసినందుకు రావాల్సిన గ్రాట్యుటీ ఇవ్వాలని కంపెనీ వారిని అడిగినా ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారు. దీంతో ఆమె తనకు తెలిసిన వారి ద్వారా బీఆర్‌టియు రాష్ట్ర కార్మిక నాయకుడు రవిసింగ్‌కు తన సమస్యను విన్నవించుకుంది. దీంతో ఆయన వెంటనే స్పందించి కంపెనీ యాజమాన్యంతో పలుమార్లు చర్చించి కార్మికురాలికి రావాల్సిన గ్రాట్యుటీ మొత్తం 50 వేలరూపాయలను ఇప్పించారు. దీంతో కార్మికురాలు స్వప్న రవిసింగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చారి, మనోజ్‌కుమార్, అనిల్‌కుమార్, సుదర్శన్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రుణం.. పని తీరే ఆధారం!

- పొదుపు సంఘాలకు ఇకపై గ్రేడింగ్ విధానం
- రెండు జిల్లాల్లో 22,580 స్వయం సహాయక సంఘాలు
- పోటీతత్వం పెంచేందుకు ఉపయుక్తం



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వపరంగా, బ్యాంకుల రుణాలను సకాలంలో చెల్లిస్తున్న వారిలో సింహభాగం మహిళా సంఘాలవే. బ్యాంకు అధికారులు సైతం ఈ పొదుపు సంఘ సభ్యులకు రుణాలు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఈ రంగాన్ని మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం రకరకాల ప్రయోగాలకు రూపకల్పన చేస్తోంది. ఈక్రమంలోనే తాజాగా 'గ్రేడింగ్' విధానం తీసుకొచ్చింది. సంఘాలను మరింత పటిష్టం చేయాలన్న లక్ష్యంతో ఈ విధానం అమలు చేయనున్నారు.

గ్రేడింగ్ ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 22,580 స్వయం సహాయక మహిళా సంఘాలు ఉండగా 2,43,244 మంది సభ్యులున్నారు. ఇందులో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 3,383 స్వయం సహాయక సంఘాలు ఉండగా 36,553 మంది సభ్యులు ఉన్నారు. అలాగే రంగారెడ్డి జిల్లాలో 19,192 స్వయం సహాయక సంఘాలు ఉండగా 2,06,691 మంది సభ్యులు ఉన్నారు. గ్రేడింగ్ విధానంలో మహిళా సంఘాలకు ఎనిమిది అంశాల ఆధారంగా ఏ, బీ, సీ, డీ గ్రేడ్లు ఇవ్వనున్నారు. ఒక్కో సంఘం 75 శాతానికి పైగా లక్ష్యాలు సాధిస్తే 'ఏ' గ్రేడ్, 60 శాతం కంటే తక్కువ సాధిస్తే 'డీ', అంతకంటే దయనీయంగా ఉంటే 'ఈ' గ్రేడ్‌గా నిర్ణయిస్తారు. ఇప్పటి వరకు గ్రామైక్య సంఘాలకు మాత్రమే గ్రేడింగ్ విధానం అమలులో ఉంది. ఏ, బీ, సీ గ్రేడింగ్‌ల్లో ఉన్న గ్రామైక్య సంఘాలకే స్త్రీనిధి రుణాలు కేటాయిస్తున్నారు. కాగా, ఇక మీదట క్షేత్రస్థాయిలో స్వయం సహాయక సంఘాలకూ ఇదే నిబంధన వర్తించనుంది. గ్రేడింగ్‌లో వెనకబడితే బ్యాంకు, స్త్రీనిధి రుణాలు పొందటం ఇకపై కష్టమే.

పెరగనున్న అధికారుల పర్యవేక్షణ

గ్రేడింగ్ విధానం అమలులోకి రావటంతో మహిళా సంఘాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరగనుంది. ఇప్పటికే సమావేశాలకు సంబంధించి లైవ్ ఫొటో తప్పనిసరి చేశారు. అంతేకాకుండా రుణ వాయిదాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈక్రమంలో తరచూ సమావేశాల నిర్వహిస్తూ రుణాల చెల్లింపులో వెనుకబడిన సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రేడింగ్‌ల్లో ఎప్పుడూ ముందుండేలా సంఘాల వారీగా నివేదికలు తెప్పించుకుని సమీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో సంఘ సభ్యుల్లో పోటీతత్వం అలవడి మరింత సక్రమంగా లావాదేవీల నిర్వహణకు అవకాశం ఉంటోంది.

నిర్దేశించిన అంశాలు..

ప్రతినెలా రెండుసార్లు సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. అంతేకాకుండా సమావేశాలకు పూర్తిస్థాయిలో సభ్యుల హాజరు కావాలి. వీటితో పాటు ప్రతినెలా క్రమం తప్పకుండా పొదుపు చేయడం, అంతర్గత రుణాల చెల్లింపులు, సామాజిక పెట్టుబడి నిధి(సీఐఎస్ఎఫ్) అప్పు కట్టడం, స్త్రీనిధి రుణ వాయిదాలతో పాటు గ్రామ సంఘానికి సంబంధించిన రుణ వాయిదాలతో పాటు బ్యాంకు అప్పు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

బాలానగర్: తెలంగాణ రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత కూడా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని పైపులైన్ రోడ్డులో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి చర్యలు చేపట్టారు. కొన్ని సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్యతో ఫతేనగర్ డివిజన్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీంతో ఈ సమస్య పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే కృష్ణారావుతో చర్చించి నిధులు కేటాయించామని అన్నారు. దశలవారీగా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం పనులు చేపడతామన్నారు. దీని ద్వారా డివిజన్‌లో హరిజన బస్తీ, నేతాజీ కాలనీ, సర్దార్ పటేల్‌నగర్, జవహర్‌నగర్, పైపులైన్ రోడ్డులో డ్రైనేజీ సమస్య నుంచి ఊరట కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కరుణాకర్, కృష్ణ చారి, భూమారావు, వీరేశం గుప్తా, లల్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఆనంద్ నాయీకి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న బండి రమేష్

బాలానగర్: బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కేపీహెచ్‌బీ డివిజన్‌కు చెందిన ఐఎన్‌టీయూసీ కార్మిక విభాగం నాయకుడు మామిల్ల ఆనంద్‌నాయీ గురువారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ



భూమిపూజలో బండి రమేష్, వెంకటేశ్వరరావు, మధుసూదన్

కూకట్‌పల్లి: బాలాజీనగర్‌లో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ శంకుస్థాపన గురువారం నిర్వహించారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావులు పాల్గొని భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు గూడెపు నాగరాజు, గొట్టిముక్కల భాస్కరరావు, సాదు ప్రతాప్‌రెడ్డి, ఆలయ ఫౌండర్ చైర్మన్ మధుసూదన్ గుప్తా, ప్రెసిడెంట్ సంతోష్‌కుమార్, ట్రెజరర్ చిత్త భాస్కర్, సెక్రటరీ ప్రభాకర్, సతీష్, జగదీష్, సింగంశెట్టి రాజు, సునీల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న ఆలయ అధికారులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగానగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం ఆరు నెలలకు సంబంధించిన హుండీ డబ్బులను లెక్కించారు. దేవదాయ ధర్మదాయ శాఖ సికింద్రాబాద్ డివిజన్ పరిశీలకులు కె. మోహన్‌రెడ్డి, కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణ, జీఏకే కృష్ణ పర్యవేక్షణలో హుండీని భక్తుల సమక్షంలో లెక్కించారు. 4లక్షల 25 వేల 268 రూపాయల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వీఎస్‌వీ సత్యనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యులు బండారి సుశీల్ కుమార్‌యాదవ్, ఆర్.సత్యనారాయణ స్వామి, సనత్‌చారి, అర్చకులు లక్ష్మణశాస్త్రి, కొండపాక వెంకటాచార్యులు, అనిల్‌కుమార్, ఆలయ సిబ్బంది రాజు, సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న భాష్యం స్కూల్ విద్యార్థులు

అల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లోని భాష్యం హైస్కూల్‌లోని విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ చిట్టి బుర్రలో ఉన్న ఆలోచనలకు కాన్వాస్‌పై ప్రాణం పోశారు. వివిధ రకాల రంగు రంగుల చిత్రాలను గీసి ఔరా అనిపించారు. గురువారం భాష్యం హైస్కూల్‌లో వైవా ఎడ్యుకేషన్ సంస్థ వారు 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 7 భాష్యం శాఖల విద్యార్థులు పాల్గొన్నారు. భాష్యం లిటిల్ చాంప్స్ వివేకానందనగర్‌కాలనీ విద్యార్థులు ఎంతో సృజనాత్మకతను ప్రదర్శించి ఏడు బహుమతులను కైవసం చేసుకున్నారు. పోటీల్లో 3వ తరగతి విద్యార్థులు ఒక బహుమతి, 4వ తరగతి విద్యార్థులు ఒక బహుమతి, 5వ తరగతి విద్యార్థులు మూడు బహుమతులు పొందారు. ఈ కార్యక్రామనికి వైవా ఎడ్యుకేషన్ నిర్వాహకులు, భాష్యం స్కూల్స్ శాఖల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఎల్‌ఓసీ పత్రం అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

అల్విన్‌కాలనీ: ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ వైద్య సేవలకు బిల్లులు చెల్లించలేని వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఎంతో ఆదుకుంటుందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆలివ్‌కాలనీ డివిజన్ పంచమికాలనీకి చెందిన ఏఎస్ జాన్సన్‌కు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన రూ.2.50లక్షలకు సంబంధించి ఎల్‌ఓసీ పత్రాలను గురువారం జగదీశ్వర్‌గౌడ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల కోసం అనేక పథకాలను తీసుకువస్తున్నారని, వీటిని నిజమైన పేదలు అందిపుచ్చుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొంది బిల్లులు చెల్లించని వారు దరఖాస్తు చేసుకుంటే ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో బాషిపాక యాదగిరి, బసంత్‌రాజ్, రాములు ఉన్నారు.